

కిలో టమోటా రూ.196



రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన టమోటాలు

ప్రజాశక్తి-మదనపల్లె రూరల్

మదనపల్లె మార్కెట్‌లో టమాటా ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో టమోటా పంట దిగుబడి తగ్గింది. మదనపల్లె మార్కెట్ పరిధిలో శనివారం రికార్డు స్థాయిలో కిలో నాణ్యమైన టమోటా రూ.196 పలికింది. అత్యల్పంగా రూ.140 ధర పలికింది. మార్కెట్‌కు రైతులు కేవలం 253 టన్నులు మాత్రమే తీసుకువచ్చారు. మార్కెట్‌లో ఏ గ్రేడ్ కిలో రూ.160 నుంచి రూ.196, బి గ్రేడ్ రూ.120 నుంచి రూ.156 వరకు పలికిందని మార్కెట్ యార్డు కార్యదర్శి అభిలాష్ తెలిపారు. బుధవారం రూ.168 పలికిన ధర.. ప్రస్తుతం రూ.196కి పైగా పలకడంతో వినియోగదారుల్లో గుబులు మొదలైంది.

దర్జాలేని దర్జీ బతుకులు

- వెలవెలబోతున్న కుట్టుమిషన్ల దుకాణాలు
- అరకొర పనులతో పొట్ట నింపుకుంటున్న టైలర్లు



ప్రజాశక్తి - రాయచోటి

సమాజంలో సామాన్యుడు మొదలు అత్యున్నతస్థానం అలంకరించే అమాత్యులు, అధికారులు, సినీ కళాకారుల వరకు దర్జీ వృత్తిదారులతో సంబంధాలు ముడపడి ఉంటాయి. కానీ వారి నుంచి దర్జీలు ఆర్జించగలిగేది ప్రశంసలు మాత్రమే. దర్జీలకు వయస్సు మళ్లిన తర్వాత బతుకు బరువు కావడంతోపాటు సానుభూతి మాత్రం మిగులుతుందన్న ఆవేదన వ్యక్తం అవుతుంది. ప్రభుత్వాలెన్ని మారినా ప్రోత్సాహకాలు లేకపోవడంతో దర్జీల జీవితాలు దర్జాకు దూరం అవుతున్నాయి. ప్రత్యేకించి ప్రస్తుతం ఫ్యాషన్ రంగం విస్తరించడం, అందుకు ధీటుగా రెడీమేడ్ షోరూంల ఏర్పాటుతో టైలర్స్ ఆర్థికాభివృద్ధికి దూరం అవుతున్నారు. ఏండ్ల తరబడి తమ హక్కుల కోసం, ప్రభుత్వ ఆదరణ కోసం ఆశగా ఎదురు చూస్తున్న టైలర్స్‌తో పాటు అదే వృత్తికి అనుబంధంగా ఉన్న కార్మికులు, మహిళలు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వందలాది మందికిపైగా స్త్రీ, పురుషులు, యువత టైలరింగ్‌నే నమ్ముకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

నేడు అన్ని వయస్సుల వారికి రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. ఫ్యాషన్ రంగం విస్తరించింది. టీషర్ట్‌లు, జీన్స్ ప్యాంట్లు, షాట్‌లు రకరకాల దుస్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. యువత ఆసక్తిని ఆదాయవనరులుగా మార్చుకునేందుకు పెద్ద బ్రాండెడ్ కంపెనీలు నగరాలతో పాటు చిన్నచిన్న పట్టణాలు, గ్రామాలకు సైతం ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. దీంతో సామాన్యుడు సైతం స్టైల్ పట్ల ఆకర్షితుడై రెడీమేడ్ వైపు మక్కువ చూపడంతో టైలరింగ్ షాపుల మెట్లు ఎక్కేవారు క్రమేణా తగ్గి పోతున్నట్టుగా పలువురు టైలర్స్ వెల్లడిస్తున్నారు. మహిళలు సైతం నేడు పంజాబీడ్రెస్, లెగిన్‌ప్యాంట్‌లు, మగవారితో సమానంగా జీన్స్, టీషర్ట్స్ వినియోగంపై ఏ మాత్రమూ వెనుకడుగు వేయకపోవడంతో అంతా రెడీమేడ్ ప్రపంచంగా మారుతోంది.

వెలవెలబోతున్న కుట్టుమిషన్ల దుకాణాలు

ఒకప్పుడు కుట్టుపని ద్వారా దర్జీలు చక్కగా జీవనం సాగించేవారు. పండగ వచ్చిందంటే రెండు నెలలు ముందే బట్టలు కుట్టించుకునేందుకు టైలర్‌షాపుల వద్ద క్యూ కట్టేవారు. పండగ రోజుల్లో టైలర్లకు చేతినిండా పని దొరకడమే కాకుండా డబ్బులు బాగా సంపాదించుకునేవారు. సంక్రాంతి, ఉగాది, దీపావళి, నిశ్చితార్థాలు, వివాహాలు, పుట్టినరోజులు వంటి శుభకార్యాలకు నూతన వస్త్రాలు కుట్టించుకోవడం ఆనవాయితీ. మహిళలైతే జాకెట్లు కుట్టించుకోవడం కోసం లేడీ టైలర్ దగ్గర వేచి ఉండాల్సిన పరిస్థితి. నేడు అంతా ఎంబ్రాయిడింగ్, బోటిక్ వంటి లేటెస్ట్ కుట్టు యంత్రాలు రావడంతో మహిళలు డబ్బును సైతం లెక్కచేయకుండా వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. ఇక పురుషుల విషయంలోకి వస్తే గతంలో ప్యాంటు, షర్టు, జుబ్బాలు ఇవన్నీ కూడా కుట్టించుకునేవారు. చేతిలో కట్టుపని లేకపోవడంతో చాలా మంది దర్జీలు ఉపాధి కూలీలుగా మారుతున్నారు. మరికొందరైతే ఏకంగా మిషన్లను అమ్మివేసి చిన్న చిన్న దుకాణాలలో కూలీ పనులు చేసుకుంటున్నారు. టైలర్లను ప్రభుత్వం ఆదుకోకపోవడంతో చేసేది లేక దర్జీలు ఉన్న మిషన్లను మూలన పడేసి ఇతర పనులపై వెళ్తున్నామని చెబుతున్నారు.

అందని ప్రభుత్వ సాయం

కుట్టుమిషన్ నేర్చుకుంటే జీవనోపాధి ఉంటుందని ఎందరో కుట్టుపని నేర్చుకొని స్వయంగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. టైలర్లకు వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కానీ ఈ సంవత్సరం విద్యుత్ మీటర్, పట్టాదారు పాస్ పుస్తకం, వాహనాలు పలు షరతులతో ఈ పథకం వర్తించదని పాలకులు సాకులు చెడుతుండడంతో ప్రభుత్వ సాయం అందడం లేదని టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వం అందించే రూ. 10 వేల సాయంతోపాటు ఇతర పథకాలు వర్తింపజేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

టైలర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. వైఎస్ఆర్ చేయూత అందజేయాలి. టైలర్‌లకు విద్యుత్ కుట్టు మిషన్లు, విద్యుత్ ఇస్త్రీ పెట్టను వంటి వస్తువులను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందజేయాలి. 30 సంవత్సరాలుగా తాను టైలర్ పని సాగిస్తూ చేస్తూ జీవనం సాగిస్తున్నాను. గతంలో మాదిరిగా ప్రస్తుతం గిట్టుబాటు లేదు. టైలర్లకు పెన్షన్ మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలి.



- సి.వెంకటేష్, టైలర్, రాయచోటి.

మహిళా చట్టాల అమలులో నిర్లక్ష్యం తగదు

హింసపై మహిళల పోరుయాత్రలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దేశంలో రాష్ట్రంలో మహిళలపై దాడులు, మాన భంగాలు, హత్యలు రోజురోజుకు తీవ్రమవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయడంలో నిర్లక్ష్యమే కారణమని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరుయాత్ర రాష్ట్ర జాతా శనివారం పుట్టపర్తి జిల్లా కదిరి నుంచి అన్నమయ్య జిల్లాకు చేరుకుంది. గాలివీడు, రాయచోటి, చిన్నమండెం, కురబలకోట మీదుగా మదనపల్లె వరకూ సాగింది. రాయచోటి కెజిబివిఎస్ మోడల్ స్కూల్, బస్టాండ్ సర్కిల్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజలు జాతాను ప్రారంభించారు. మొదట మహిళల మీద జరుగుతున్న ఆకృత్యాలు ఉట్టిపడేలా ప్రజానాట్య మండలి బృందం ప్రదర్శించబడిన ఆట, పాట నృత్యాలు ప్రజానీకాన్ని ఆకట్టుకుంటూ ఆలోజింపచేశాయి. జాతా ప్రధాన వక్త ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ దేశ ప్రతిష్ట పెంచిన మహిళా రెజ్లర్లు గోల్డ్ మెడల్ తెస్తే వారిపై లైంగిక వేధింపులు, మణిపూర్‌లో హింసాకాండ, యూనివర్శిటీలలో లైంగిక వేధింపులకు ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థి నులు ఎంతో మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ చిన్నారులపై మహిళలపై హింస రోజు రోజుకి విపరీతంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరి గించి అత్యాచారం చేసి హత్యలు చేస్తున్నప్పటికి ప్రదాని మోడీకి చలనం లేదన్నారు. చివరకు సుప్రీం కోర్టు స్పందించే వరకు కేసులు నమోదు చేయలేదన్నారు. కేసులు అయితే నమోదు చేసి ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రోజుకు వందల సంఖ్యలో మహిళలు అదృశ్యమైన కేసులు వెలుగు చూస్తున్నా దిశ, నిర్భయ లాంటి చట్టాలు పేరుకేనని అమలులో నిర్లక్ష్యం ప్రభుత్వాలు వీడాలని సూచించారు. రిజర్వేషన్ల అమలులలో జాప్యం వీడాలన్నారు. 3200 మంది మహిళలు అదృశ్యమైతే ప్రభుత్వాలు నోరుమెదపలేదని పేర్కొన్నారు. 190 మంది అత్యాకారాలకు గురయ్యారన్నారు. మహిళలు ఐక్యంగా సమస్యల పట్ల ఉద్యమిం చాలన్నారు. మత్తు, మద్యం వల్లే నిత్యం మహిళలు హింసకు, దాడులకు గురి అవుతున్నారని వీటిని సంపూర్ణంగా నిషేధించాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర సమయంలో జగన్ మోహన్ రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దశలవారీగా మద్యం నిషేధిస్తామని చెప్పి నిషేధ చట్టాన్ని తీసుకురాక పోగా మత్తు పదార్థాలను విచ్చలవిడిగా దొరికే విధంగా చేశారని విమర్శించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లా డుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ బిజెపి ప్రభుత్వం దేశాన్ని, దేశ సంపదను, ఖనిజాలను ఆదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. అందుకోసమే ఆర్టికల్ 370 రద్దుచేసి కాశ్మీర్ భూములపై అదానీ, అంబానీల పెత్తనం చలాయించే విధంగా చేశారన్నారు. ఆగస్టు ఎనిమిదిన మహిళల సమస్యలపై విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా గౌరవ అధ్యక్షులు దిల్షాద్, రాష్ట్ర నాయకులు రామంజులమ్మ, ఐద్వా అన్నమయ్య జిల్లా కన్వీనర్ ఇ.భాగ్యమ్మ, బంగారుపాప, ఖాజాబి, రెడ్డెమ్మ, నిర్మల, మాధవి, కరుణ, లావణ్య, పద్మజ, ప్రజానాట్య మండలి కార్యదర్శి వెంకటాచలపతి, శ్రీరాములు, పలువురు పాల్గొన్నారు. జాతా మదనపల్లె నుంచి చిత్తూరు జిల్లా కుప్పంకు చేరుకుంది.



మహిళా కళాకారుల నాట్యప్రదర్శన



రాయచోటి బహిరంగ సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

విద్యార్థులపై జగన్‌కు చిత్తశుద్ధి లేదు

రాజంపేట అర్బన్ : విద్యార్థులపై సిఎం జగన్‌కు చిత్తశుద్ధి లేదని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్ అన్నారు. పట్టణంలోని టిఎన్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో విదేశీ విద్యా దీవెన పథకం అమలు తీరు అంతా మిథ్యగా మారిందన్నారు. కేవలం అనర్హులు, వైసిపికి సంబంధించిన నాయకుల పిల్లలకు మాత్రమే విదేశీ విద్యా దీవెన పథకం కింద నిధులు మంజూరు చేసి అర్హులకు మొండిచేయి చూపారని మండిపడ్డారు. కఠిన తరమైన నిబంధనలతో లబ్ధిదారుల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా వైసిపి పనిచేస్తుందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు, విదేశాలలో ఉన్నత చదువులు చదవాలనుకునే వారి కళలు వైసీపీ ప్రభుత్వం కలలుగానే మిగిల్చిందన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చింది గోరంత తాము ఇవ్వబోయేది కొండంత అంటూ గత ఎన్నికల సమయంలో జగన్ చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయని విమర్శించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విదేశాల్లో ఏ యూనివర్సిటీలో సీట్లు తెచ్చుకున్నా విదేశీ విద్యను అమలు చేసి, విద్యార్థులకు బాసటగా నిలిచిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కిందన్నారు. ఈ సారి ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గించారన్నారు. గత ఏడాది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 28 మంది విదేశీ విద్య ద్వారా లబ్ధిపొందగా ఈ ఏడాది ఐదుగురు మాత్రమే అర్హత సాధించారంటే ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల పట్ల ఈ ప్రభుత్వానికి ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతుందన్నారు.



మాట్లాడుతున్న బండి ఈశ్వర్

దళితులే ముఖ్యమంత్రి కావాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

రాష్ట్రంలోని దళితులకు న్యాయం జరగాలంటే దళితులే ముఖ్యమంత్రి కావాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్ పేర్కొన్నారు. శనివారం దళితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వంలో దళితలకు అరాచకాలు అధికమయ్యాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దళితులను అగ్రవర్ణాల వారు కొట్టడం, ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కువ శాతం ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిలు, మైనార్టీలుండగా కేవలం రెండు శాతమున్న అగ్రకులాలే పాలన చేస్తున్నారని వాపోయారు. ఎక్కడ చూసినా దళిత మహిళలపై అత్యాచారాలు, దాడులు చోటు చేసుకుంటున్నాయని, ముఖ్యమంత్రి సిఎం మాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దళితుల ఓట్లతో ముఖ్యమంత్రి పదవి చేజిక్కించుకుని వారికి అన్యాయం చేయడం దారుణమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పి అధిక మెజార్టీతో దళిత వ్యక్తిని గెలిపించాలని, అప్పుడే మనకు న్యాయం జరగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు రమణయ్య, జాతీయ నాయకుడు కృష్ణ స్వరూప్ ప్రదీప్, డి.వి రమణయ్య ,మండలంలో మాల మహానాడు నాయకులుపాల్గొన్నారు.

వైసిపి పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - సుండుపల్లె

వైసిపి పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని టిడిపి మండల అధ్యక్షులు రెడ్డప్ప పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రాష్ట్రానికి, రైతులకు వెన్నెముకగా ఉన్న పోలవరం ప్రాజెక్టును పట్టించుకోలేదని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని పింఛా, అన్నమయ్య ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టును అటకెక్కించారని, బిందు, తుంపర్ల సేద్యంలో సబ్సిడీ పరికరాలు రైతులకు అందజేయడంలో పూర్తిగా విఫలమై రైతులను నట్టేట ముంచారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వంలో నదులు అనుసంధానం చేసి రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు సైతం హంద్రీనీవా ద్వారా వ్యవసాయ రైతులకు సాగు నీరు అందించారని చెప్పారు.

మల్లయ్యకొండ సన్నిధిలో న్యాయమూర్తి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

అనంతపురం జిల్లా తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ న్యాయమూర్తి చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి చంద్రకళ దంపతులు శనివారం మల్లయ్య కొండను సందర్శించారు. ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి కొండకిట్ట పూజారులు ఈశ్వరప్ప మల్లికార్జునలో న్యాయమూర్తికి స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం గౌరమ్మ గుట్టలో వెలసిన గౌరమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ పూజారి శేఖర్ విజయనిర్మలు అమ్మవారికి పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి వెంట న్యాయమూర్తి తల్లిదండ్రులు చిన్న రెడ్డప్ప, సావిత్రమ్మ మామ బయ్యారెడ్డి, అత్త శంకరమ్మ (కోటఊరు మాజీ సర్పంచ్) చిన్నాన్న శివశంకర్ రెడ్డి, నిర్మల ఉన్నారు.



మల్లయ్య కొండలో ప్రత్యేక పూజలు చేస్తున్న న్యాయమూర్తి దంపతులు



జగనన్న కాలనీల్లో గుంతల్లో దిగి నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో ప్రభుత్వం విఫలం

రైల్వేకోడూరు: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం విఫలమైందని జనసేన రాష్ట్ర కార్యదర్శి టి.నాగేంద్ర నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వెంకటసుబ్బయ్య అన్నారు. జనసేన నాయకులు ఫెల్యూర్ జగనన్న కాలనీస్ పేరుతో నిరసన కార్యక్రమం మండలంలోని బుడుగుంటపల్లిలో చేపట్టారు. జగనన్న కాలనీ సందర్శించి వాస్తవ పరిస్థితులు ప్రజలకు తెలియ పరుస్తూ మండల పరిధిలో 1676 ఇళ్లు మంజూరు కాగా 250 మాత్రమే ఒక మోస్తరు పనులు జరిగాయని, బుడుగుంటపల్లిలో 103 మంజూరు కాగా 18 మాత్రమే పనులు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో నాయకులు పగడాల వెంకటేష్, సర్పంచ్ సంయుక్త, ముద్దపోలు రామ సుబ్బయ్య, వరికూటి నాగరాజ, శ్రీకారం ప్రకాష్, దాసరి వీరేంద్ర, ఉత్తరాది శివ కుమార్, బల్లేపల్లి శ్రీనివాస్, సవరం సాయి, సవరం బాలు, అనంత రాయలు, సాయం శ్రీధర్, పల్లపు గోపి, చౌడవరం రవి పాల్గొన్నారు.

దారుణం

ప్రజా'దృష్టి'

అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి సమీపంలోని ఇటీవల కడప-చెన్నయ్ ప్రదాన రహదారిపై ఆర్‌టిసి బస్సును ట్యాంకరు ఢీకొన్న ఘటన విస్మయాన్ని కలిగించింది. రెండ్రోజుల కిందట డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి రోడ్డు ప్రమాదాల నివారణలో పురోగతి సాధించామని పేర్కొనడానికి రెండ్రోజుల ముందు దారుణ ప్రమాదం ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు అనుసరించిన మార్గాలేమిటో గమనించాలి. వాటిని దేశీయ అవసరాలకు అనుగుణంగా మర్పులు చేర్పులు చేసుకుని అమలు చేయాల్సి ఉంటుది. ఇదే తరహాలో గల్ఫ్ దేశాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు అమలు చేస్తున్న విధానాల తీరును గమనించాలి. లేకపోతే ఓ సినిమాలో రోడ్డు ప్రమాదాల నివారణ. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ నిమిత్తం భారీ జరిమానాల విధించిన తీరును గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి వాహన డ్రైవరును పోలీసు, ఆర్‌టిఒ అధికారులు సంయుక్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌ల సంఖ్యను పెంచాలి. డ్రంక్ అండ్ డ్రైవ్‌ల పేరిట మద్యం తాగిన డ్రైవర్లపై దశలవారీగా జరిమనాల సంఖ్యను పెంచే ఆలోచన చేయాల్సిన అంశాన్ని పరిశీలించాలి. జరిమానాలను లెక్క చేయని డ్రైవర్ల లైసెన్ల రద్దు అంశాన్ని సీరియస్‌గా పరిశీలించాలి. వీరికి అనుబంధంగా ఆర్‌అండ్‌బి అధికారులు రహదారుల అభివృద్ధి పనులపై దృష్టి సారించాల్సి ఉంటుంది. పోలీసులు, ఆర్‌టిఒ, అర్‌అండ్‌బి అధికారులు సంయుక్తంగా సమన్వయంతో పనిచేస్తే రోడ్డు ప్రమాదాలను అదుపులోనికి తీసుకుని రావచ్చని చెప్పుకోవచ్చు. ఇదిలా ఉండగా ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణపై కసరత్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఏటా వందలాది కుటుంభాలు పోషకులను కోల్పోయి వీధిన పడుతున్న అంశాన్ని గమనంలో ఉంచుకోవాలి. రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు మందుల ఖర్చులను ప్రభుత్వమే భరించాల్సి వస్తున్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. పోలీస్, న్యాయం, వైద్య సదుపాయాల నిమిత్తం చేయాల్సిన, చేస్తున్న పద్దులను అండ్ డ్రైవ్ విభాగాలపై వెచ్చిస్తే వేలాది కుటుంభాలను కాపాడుకోవచ్చునడంలో సందేహం లేదని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి-కడప ప్రతినిధి

రోడ్డు విస్తరణ పనుల్లో అవినీతి వాటా ఎంత? : సిపిఎం



అధికారులు కూల్చుతున్న ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి- రాజంపేట రోడ్డు విస్తరణ పనుల్లో వైసిపికి అందుతున్న అవినీతి వాటా ఎంత అని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ప్రశ్నించారు. శనివారం రాయచోటి పట్టణంలో రాయచోటి-రాజంపేట రోడ్డు విస్తరణలో అక్రమంగా ఇళ్లు కూలుస్తున్న ప్రాంతంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ప్రజాస్వామ్యాన్ని వైసిపి ప్రభుత్వం ఖూనీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితుల పొట్ట కొట్టడం అభివృద్ధా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అవసరాలకు, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ, ప్రయివేటు భూములు తీసుకువచ్చుని, కోల్పోయిన వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, ముందుగా గ్రామ సభలు నిర్వహించాలనే ఇంగితజ్ఞానం లేకుండా, ప్రాణాలను భయభ్రాంతులకు గురి చేసి రోడ్డు వేస్తామని చెప్పడం దుర్మార్గం అన్నారు. రోడ్డు వేయడానికి అడ్డమున్న ఇళ్లను కూల్చివేస్తామని నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని అధికారులు అంటున్నారంటే అధికార పార్టీ తొత్తులుగా ఉన్నట్లుగా అర్థమవుతోందని చెప్పారు. రాజ్యాంగ చట్టాలను అమలు చేయలేని అధికా రులు ఎవరైనా వైసిపి కార్యకర్తలుగా చెప్పుకోవచ్చని హితవు పలికారు. రోడ్డు విస్తరణలో అధికార పార్టీ నాయకులు, కాంట్రాక్టర్లు, అధికారుల మధ్య కుదిరిన అక్రమ అవినీతి ఒప్పందం కారణంగా ఇల్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇవ్వకుండా, వాటాల కోసం భయభ్రాంతులకు గురి చేసి, హక్కులను కాలరాస్తున్నారని ఇది సహించేది లేదని హెచ్చరించారు. బాధితులకు అండగా ఉంటామని, నష్టపరిహారం చెల్లించే వరకు పోరాడు తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫయాజ్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో మారణహోమాన్ని అరికట్టాలి

రాజంపేట అర్బన్ : మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడడంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ వున్న బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెంది ట్రబుల్ ఇంజన్ ప్రభుత్వంగా మారిందని కాంగ్రెస్ పార్టీ రాజంపేట బాధ్యులు పూల భాస్కర్ విమర్శించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేవలం 28 లక్షల జనాభా ఉన్న మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడలేని బిజెపి ప్రభుత్వం 140 కోట్ల జనాభా ఉన్న దేశాన్ని ఎలా కాపాడుతుందన్న అనుమానం ప్రజలకు కలుగుతోందన్నారు. ఇది దేశ సమైక్యతకు, ప్రతిష్టకు సంబంధించిన అంశమని., ఆలస్యం చేయకుండా శాంతి భద్రతలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అప్పులు చేయడంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రం లోని జగన్ ప్రభుత్వం దొందూ దొందేనన్నారు. బిజెపి దేశాన్ని అప్పుల భారత్ గానూ, వైసిపి రాష్ట్రాన్ని రుణాంధ్ర ప్రదేశ్‌గా మార్చాయని విమర్శించారు. బంగారు, భూములు తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకోవడం చూశాము కానీ, త్రాగుబోతులను తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకోవడం జగన్ ప్రభుత్వంలోనే చూస్తున్నామన్నారు.

రాయలసీమ ద్రోహి సిఎం జగన్ : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాయలసీమ వాసిగా ఉండి ఈ ప్రాంతాన్ని ఎండగట్టిన ద్రోహి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని, ఆయన పోతేనే సీమలో సిరులు పండుతాయని టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్యాల చెంగల్రాయులు అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ నీటి ఎద్దడిని తీర్చడానికి గతంలో ఎన్‌టి.రామారావు తెలుగు-గంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా వంటి ప్రాజెక్టులను తీసుకొచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు కృషి చేశారని తెలిపారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కూడా రాయలసీమలో నీటి ప్రాజెక్టులకు తన వంతు కృషి చేశారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఒకే ఒక్క జీవోతో సీమలో 102 ప్రాజెక్టుల పనులను రద్దు చేశాడని, సీమ ప్రాజెక్టులపై టిడిపి ఐదేళ్లలో రూ.12,411 కోట్లు ఖర్చు చేస్తే వైసిపి నాలుగేళ్ల పాలనలో రూ.2011 కోట్లు మాత్రమే ఖర్చు చేసి చేయి దులుపుకున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ఇసుకతో పాటు కాలువలోని మట్టిని కూడా అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. పాలకుల ఇసుక దోపిడీ కారణంగా 2021 నవంబర్ 19న అన్నమయ్య ప్రాజెక్టు సమూలంగా కొట్టుకుపోయి 60 మంది జల సమాధి ఐతే రాష్ట్ర ప్రభుత్వం నేటికీ వరద బాధితులకు పునరావాసం కల్పించకపోగా ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క ఇటుక పేర్చిన పాపాన పోలేదని పేర్కొన్నారు. రాయలసీమలోని 102 ప్రాజెక్టుల పనులు ఆపి కాంట్రాక్టు సంస్థలకు బ్యాంకు గ్యారంటీలు వెనక్కు ఇచ్చారని, సీమ ప్రాజెక్టులు ఆపిన వాడు రాయలసీమ ద్రోహి కాక రక్షకుడు అవుతాడని ప్రశ్నించారు. జగన్ రాయలసీమ ద్రోహి అనడానికి ఈ నాలుగేళ్లలో ప్రాజెక్టులలో జరిగిన పనులే నిదర్శనమని తెలిపారు. సీమలో ప్రాజెక్టుల పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆగష్టు 1న సీమ పర్యటనకు విచ్చేస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని టిడిపి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి కన్వీనర్లు, పదాధికారులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయులు



జగనన్న గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న వెంకటరమణ

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కరువు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నాశిరకపు నిర్మాణాల వలన జగనన్న కాలనీలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని, వాటి వలన ప్రజలకు ఇక్కట్లేనని రాజంపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ తెలిపారు. శనివారం పులపుత్తూరులోని జగనన్న కాలనీల స్థితిగతులపై సందర్శించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు నాణ్యమైన ఆవాసాలు నిర్మించకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నట్లు బాధితులు తమ దృష్టికి తీసుకోచ్చారన్నారు. గోడ కంటే కొంచెం ముందుకు స్లాబ్ వేయడం వలన గోడలో చెమ్మ దిగదని, కానీ బడ్జెట్ ఎక్కువవుతుందన్న కారణంగా కాంట్రాక్టర్ ఆ పద్ధతిన నిర్మించడం లేదని లబ్ధిదారులు విలపిస్తున్నారని తెలిపారు. సమస్యను ఉన్నత ఉన్నత అధికారులు దృష్టికి తీసుకోవడమే కాకుండా తమ అధినేత పవన్ కళ్యాణ్‌కు తెలియజేసి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ అధ్యక్షులు సుబ్బరాయుడు, నాయకులు భాస్కర్ పంతులు, పోలిశెట్టి రజిత పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలోని లేబాక గ్రామ పంచాయతీ పరిధిలోని ఆడపూరు పంచాయతీలో పలు గ్రామాలలో మలిశెట్టి వెంకటరమణ 104వ రోజు పవన్ అన్న ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికై జనసేనకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని పేర్కొన్నారు. జనసేన అధికారంలోకి వస్తే ప్రజలకు అందరికీ న్యాయం జరుగుతుందని ఆ గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో లేబాక జనసేననాయకులు మహేష్, వినయ్, పవన్, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్‌గా సోమశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి



సోమశేఖర్‌రెడ్డి

తంబళ్లపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా తనను నియమిస్తూ ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నియామక పత్రాన్ని అందజేసినట్లు బలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో తంబళ్లపల్లి నియోజకవర్గ కన్వీనర్‌గా పదవి ఇచ్చిన సందర్భంగా పిసిసి అధ్యక్షులు రుద్రరాజుకి, రాయలసీమ ఇన్‌ఛార్జి జంగా గౌతం, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి సాయి శక్తుల కృషి చేస్తానని తెలిపారు.



రాజు, రవీంద్రను సన్మానిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

షెడ్యూల్ కులాల వర్గీకరణకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని జిల్లా ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి కెఎస్.రాజు మాదిగ డిమాండ్ చేశారు. శనివారం తంబళ్ళపల్లి నియోజకవర్గంలోని మండలం కేంద్రంలో కొండ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో రాజు మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి వై.రవీంద్ర మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి గతంలోతాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పి నేడు అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడుస్తున్నప్పటికీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించడంలో మాదిగలను నమ్మించి మోసం చేసిన పార్టీగా బిజెపి మిగిలి పోయిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.మాదిగ ప్రజలను వర్గీకరణ విషయంలో మోసం చేసిన పార్టీలతో రాజకీయంగా తాడోపేడు తెలుసుకునేందుకు మాదిగల విశ్వరూప మహాసభను 20 లక్షల మంది ప్రజలతో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మాదిగ ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్గీకరణపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. వర్గీకరణ లక్ష్యం, మహాజన సోషలిస్టు పార్టీ చట్టసభల్లో అడుగుపెట్టే దిశగా ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా తన పర్యటన ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి దుమ్ము చిన్న కో-ఇన్‌ఛార్జి వెంకటప్ప,భవానీ వెంకటేష్, ఎంఎస్‌పి మండల కన్వీనర్ చౌడప్ప, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ ఆర్.కె.రఘు, మండల నాయకలు జెకె.శ్రీనివాసులు, సి.బాలు, కె.రాముడు, శంకర, పెద్దతిప్పసముద్రం ఎంఎస్‌పి నాయకులు వై.రామప్ప, కో-ఇన్‌ఛార్జి మల్లెల రవి, కె.వెంకటరమణప్ప, అంతరప్ప శ్యామ్, ముని, రాజు, దుమ్ము నివాస్, మనిష్ కుమార్, జెకె.ఆకాష్, నరేష్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లి ఎస్ఐగా లోకేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా లోకేశ్వర్‌రెడ్డి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో మదనపల్లె టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన శోభారాణి మదనపల్లి టూ టౌన్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలు నేరాలను పూర్తిగా అరికంటే తగు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర న్యాయ సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.



ఎస్ఐలు లోకేశ్వర్‌రెడ్డి, శోభారాణిని సన్మానిస్తున్న సిబ్బంది

నిరాశలో పత్తి రైతులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పత్తి పంటపై రైతుల ఆశలు ఈ సారి నిరాశే అని చెప్పవచ్చు. ఇదివరకే పత్తి పంటకు ఎర్రనక్క తెగులు సోకడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పది రోజులుగా మబ్బులు ఉంటూ చినుకులు రాలడంతో పతి కాయలు నేల రాలుతున్నయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదపా రైతులు ఎన్నో ఆశలు నింపుకొని పతి సాగు చేశారు. పంట కోసం వేలాది రూపాయలు వెచ్చించారు. కృష్ణా జలాలు అందుబాటులో ఉన్న కారణంగా సాగునీటి సమస్య తలెత్తలేదు. పైరు మధ్యలో అప్పుడప్పుడు కురిసిన వర్షాలు రైతుకు కాస్త ఊరట కలిగించాయి. సాగు దాదాపు ఎకరాకు రూ.25 నుంచి రూ.35,000 రైతులు ఖర్చు చేశారు. అనుకోకుండా వచ్చిన వర్షాలతో పైరు ఏపుగా పెరిగింది. పైరు కళకళలాడుతున్న దశలో తెగులు సోకడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ తెగులు వల్ల ఆకులు ఎర్రగా మారిపోవడం, పక్వానికి వచ్చిన కాయ పగిలిపోవడం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఫలితం లేదని రైతులు అంటున్నారు. దిగుబడి వచ్చిన కాడికి విక్రయించుకుని సొమ్ము చేసుకోవాల్సిన పరిస్థితి రైతులకు ఎదురైంది. పత్తి ధర కూడా గణనీయంగా తగ్గినట్లు కొంతమంది రైతులు అంటున్నారు. గతేడాది క్వింటా రూ.11వేలు పలికిందని, ప్రస్తుతం రూ.7వేలు కంటే ఎక్కువ లేదని రైతులు తెలిపారు. ఆకాశం మబ్బుల వల్లే దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోయినట్లు పేర్కొంటున్నారు. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి చేతికి అందుతుంది. ప్రస్తుతం వాతావరణం ప్రతికూలించడంతో 5 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే చేతికందే అవకాశాలున్నాయని రైతులు అంచనా వేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బ తింటున్న పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



సాగులో పత్తి

ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు : టిడిపి



మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ వాసి ముఖ్యమంత్రి అయినా కూడా రాయలసీమలో ఒక్క నీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. ఎస్ఆర్‌బిసి కాలువ పనులు పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. 2014 నుంచి 2019 వరకు సాగు నీటి ప్రాజెక్టుల మీద టిడిపి ప్రభుత్వం రూ.22,165 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం 2019 నుండి 2023 వరకు కేవలం రూ.2,011కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. రాజోలి ప్రాజెక్టు పూర్తి చేస్తామని, అధికారంలోకి వచ్చాక దాని గురించి పట్టించుకోలేదన్నారు. టిడిపికి మాత్రమే రాయలసీమ, నీటి ప్రాజెక్టుల మీద చిత్తశుద్ధి ఉందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి రాయలసీమకు చేయనంత ద్రోహం, అన్యాయం జగన్ చేశారన్నారు. రాయలసీమలో సిరులు పండాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, భూసిరెడ్డి, రాజారెడ్డి, భాస్కర్, దస్తగిరి, మల్లారెడ్డి, సుబ్బరాజా, సురేంద్రనాథ్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాగరాజు, చంద్రమోహన్, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులను తక్షణమే నింపాలి : రెడ్యం సోదరులు

ఖాజీపేట : రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నదిలో పుష్కలంగా నీరు ఉన్నందున జిల్లాలోని కెసి కెనాల్ కింద ఉన్న చెరువులను తక్షణం నింపాలని టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ రెండ్యం చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఆ మేరకు కెసి కెనాల్ ఎస్ఇ రెడ్డి శేఖర్‌రెడ్డికి వివరించారు. మండలంలోని దుంపలగట్టులో రెడ్యం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ రాజోలి ఆనకట్ట వద్ద శుక్రవారం సాయంత్రం 10,600 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని, ఆ నీటిని కడప జిల్లాలోని కెసి కెనాల్ కింద చెరువులను నింపాలన్నారు. తక్షణం రాజోలి చేపట్టాలని సిఎంకు శనివారం లేఖ రాసినట్లు తెలిపారు.

అలసత్వమే రాజోలి రిజర్వాయర్‌కు గుదిబండ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అలసత్వమే రాజోలి రిజర్వాయర్‌కు గుదిబండలా మారిందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. రాజోలి ఆనకట్ట దగ్గర దాదాపు పదివేల క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైందని, రాజోలి రిజర్వాయర్ నిర్మించి ఉంటే ఒక రోజులోనే నిండేదని తెలిపారు. పాలకుల అలసత్వం వల్ల కడప జిల్లాలో కెసి కెనాల్ కింద ఉన్న 98 వేల ఎకరాల రైతులు, నారుమళ్లు పోసుకునేవారని వివరించారు. నీళ్లన్నీ సోమశిల డ్యామ్‌లోకి వెళుతున్నాయన్నారు. 2019లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసి 2022 కల్లా పూర్తి చేస్తామన్నారని తెలిపారు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో భూసేకరణ కూడా జరగలేదన్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి 2.98 టిఎంసిగా నిర్మించాలని, కానీ కేవలం ఒక టిఎంసి, అర టిఎంసి అంటూ ఉన్నారని, చిత్తశుద్ధి ఉండి ఉంటే ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యంతో నిర్మించడానికి రెండేళ్ల కంటే ఎక్కువ సమయం పట్టదని తెలిపారు. అనవసరమైన పథకాలకు మాత్రమే జగన్ ప్రాధాన్యతనిస్తున్నారని, ఇది సరికాదని ప్రతాప్ రెడ్డి విమర్శించారు.

75 శాతం పులులు మన దేశంలోనే..

ప్రజాశక్తి - దువ్వూరు

ప్రపంచంలోని పులుల్లో 75 శాతం మన దేశంలోనే ఉన్నాయని, ఇందులో మన రాష్ట్రంలో 48 పెద్దపులులున్నాయని అటవీ అధికారి సుబ్బరాయుడు తెలిపారు. ప్రపంచ టైగర్స్ దినోత్సవం సందర్భంగా శనివారం పుల్లారెడ్డిపేటలో ఉన్న కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అడవిలో శాఖాహార, మాంసాహార జంతువుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జాతీయ జంతువు పెద్దపులి అని తెలిపారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది సురేంద్ర,ఈశ్వరమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మున్సిపల్ చైర్మన్, అటవీ అధికారులు

పులివెందుల రూరల్ : ప్రస్తుత తరుణంలో పులులను రక్షించుకోవాల్సిన అవసరాన్ని చాటి చెబుతూ 2010 నుంచి ప్రతి ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అటవీ అధికారి తెలిపారు. నగరవనంలోని పులిబొమ్మ వద్ద నిలుచొని వాటి గురించి విద్యార్థులకు వివరించారు. సకాలంలో వర్షాలు కురిసేందుకు చెట్లు దోహదపడుతాయన్నారు. అడవులు బాగుండాలంటే అందులోని జంతుజాలం, జీవన వైవిధ్యం సమతూకంలో కొనసాగాలన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యానికి పులులే కీలకమని తెలిపారు. నగరవనంలో చైర్మన్, అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్, డేనియల్ బాబు, ప్రశాంత్, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, రాజు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** పులుల సంరక్షణపై అవగాహన అవసరమని ఎఫ్ఆర్ఓ హేమాంజలి పేర్కొన్నారు. శనివారం స్థానిక రాజీవ్ గాంధీ నేషనల్ పార్క్‌లో భాష్యం స్కూల్ విద్యార్థులకు ప్రకృతి సమతుల్యత-పులి మనుగడపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రవిచంద్ర, ఎఫ్‌బిఒలు, ఎబిఒలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

గ్రామానికి రోడ్డు వేస్తేనే ఓట్లేస్తాం

- బస్వాపురం వాసుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

తమ గ్రామానికి రోడ్డు వేస్తేనే ఓటు అంటూ మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ బస్వాపురం వాసులు శని వారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. గ్రామ రోడ్డు కోసం 30ఏళ్లుగా నిరీక్షిస్తున్నామన్నారు. చిన్నపాటి వర్షం పడినా అడుగు వేయలేని పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను అధికారులు గుర్తించాలని వార్డు సభ్యులు రాజేష్ ఆధ్వర్యంలో ప్ల కార్డులు ధరించి భిక్షాటన చేశారు. రోడ్డుపై వెళుతున్న వాహనదారుల వద్ద నుండి 'మా గ్రామానికి రోడ్డు కావాలి.. సాయం చేయండి' అంటూ భిక్షాటన చేశారు. 'ఓటు కావాలంటే.. రోడ్డు వేయాలంటూ', 'మాటలు వద్దు.. మార్పు కావాలి' అంటూ నినాదాలు చేశారు. అధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు వేయాలని వారు కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.10 కోట్లు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. ఉన్నత విద్య కళాశాలల కమిషనర్ పోలా భాస్కర్ నిధులు మంజూరు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. నూతన భవనాల నిర్మాణానికి దాదాపు రూ.22 కోట్లు మంజూరు చేశారన్నారు. కళాశాలలో ఆడిటోరియం ఏర్పాటుతో పాటు అప్రోచ్ రోడ్డు కోసం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ నిధులతో త్వరలో నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో ఆడిటోరియం, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డికి జడ్పీటీసీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సిఎం జగన్ పెద్ద పీట వేస్తున్నట్లు రవికుమార్‌రెడ్డి తెలిపారు.

నేడు చిత్ర కవితా సౌరభం గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కళాభారతి నాటక సంస్థ, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం అలంకారం వేంకట రమణరాజు రచించిన చిత్రకవితా సౌరభం గ్రంథాన్ని స్థానిక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆవిష్కరించనున్నట్లు కళాభారతి సంస్థ కార్యదర్శి కొత్తపల్లి శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ రచయిత కొమ్మిశెట్టి మోహన్ సభాధ్యక్షుడిగా, అతిథులుగా చదువుల సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు, సంస్కృత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ పద్య కవులు ఎసి దస్తగిరి, డాక్టర్ వియమ్ భాస్కరరాజు, టిటిడి ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు డాక్టర్ మూలె రామముని రెడ్డి, పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, సాహితీ వేత్తలు జి.వి.సాయిప్రసాద్, అవధానం అమృతవల్లి, అలంకారం విజయకుమార్ హాజరవుతారని తెలిపారు కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, కళాకారులు, అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఐకమత్యంతో టిడిపిని గెలిపిస్తాం : 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టిడిపి టిక్కెట్ ప్రొద్దుటూరులో ఎవరికిచ్చినా ఐకమత్యంతో పార్టీని గెలిపిస్తామని మాజీ ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి తెలిపారు. రాష్ట్ర టిడిపి నాయకులు సీఎం సురేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాం టీన్‌లో రెండవ మొబైల్ అన్న క్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వరద విలేకరులతో మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో పేదల ఆకలి తీర్చాలనే సంకల్పంతో రూ.5కే భోజన వసతి కల్పించారని గుర్తు చేశారు. ఏ రాష్ట్రంలోనైనా గత ప్రభుత్వాల సంక్షేమ పథకాలను కొత్త ప్రభు త్వాలు కొనసాగిస్తాయన్నారు. ఎపిలో అధికారం చేపట్టిన జగన్ అన్న క్యాం టీన్ల ను రద్దు చేస్తూ పేదల కడుపు కొట్టారని విమర్శించారు. సీఎం సురేష్ నాయు డు మాట్లాడుతూ అన్న క్యాంటీన్ అపురూపంగా ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞ తలు తెలిపారు. ఆగస్టు 3న జిల్లాలో చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టుల పరి శీలనకు గండికోటకు విచ్చేస్తున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షులు బుర్ర రామాంజనేయులు, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి కవులకు సినారె ఆదర్శనీయులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెలుగువారి అభిమానాన్ని దోచుకున్న జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి నేటి కవులు, రచయితలకు ఆదర్శప్రాయుడని ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొ న్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో నారాయణరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ నాగార్జున సాగరం, కర్పూర వసంత రాయులు, విశ్వనాథనాయుడు వంటి గేయకావ్యాలు, రాయప్ప వంటి రూపకాలు,కవితా ప్రపంచంలో వీరికెంతో గౌరవ స్థానాన్ని సంపాదించి పెట్టాయన్నారు. ట్రస్టు కార్యదర్శి మురళీమోహన్ మాట్లాడుతూ మలేషియా, సింగపూర్, రష్యా, అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో సినారె పర్యటించి సాహిత్య ఉపన్యాసాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువుల బాబు, ఉపాధ్యాయులు డాక్టర్ ఎన్.నాగేశ్వరరావు, వై.చంద్ర శేఖర్‌రెడ్డి, కుండా భాస్కర్, వారధి మధు, రామిరెడ్డి, ఓబులరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి


అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన బియ్యం : ఎంపిపి

ప్రజాశక్తి- కలకడ

అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వం ఇస్తున్న నాణ్యమైన రేషన్ బియ్యాన్ని సకాలంలో పంపిణీ చేయాలని తెలిపారు. ఐసిడిఎస్ రేషన్ ఓల్డ్ స్టాక్ ఏమైనా ఉంటే రిటర్న్ పంపించాలన్నారు. ఎప్పటి స్టాక్ అప్పుడే డిస్ట్రిబ్యూట్ చేయాలని తెలిపారు. రేషన్ సకాలంలో ఇవ్వాలని పేర్కొన్నారు. ఇతర సమస్యలపైన చర్చించామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రదీప్, డిటి వెంకటరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

టిడిపి రైతు సంఘం మండల అధ్యక్షులుగా నాగరాజు

ప్రజాశక్తి-బి.కొత్తకోట



నాగురాజు, రంజిత్

తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగమైన టిడిపి రైతు సంఘం మండల అధ్యక్షులుగా దేవుడు నాగరాజు, కోశాధికారిగా కుడుం రంజిత్ ఎన్నికయ్యారు. శనివారం వారికి మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ నియామకపత్రాలని అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగాల్లో రైతు సంఘం అతి ముఖ్యమైనదని, దీనిని నియోజకవర్గంలో బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఇటీవల టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మినీ మేనిఫెస్టోలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ప్రతి ఏడాది రైతులకు రూ.20 వేలు ఆర్థిక సాయం, విరివిగా పంట రుణాలు అందజేయడం వంటి గొప్ప పథకాలను అన్న దాతలకు ఎంతో దోహదపడతాయన్నారు. మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ సూచనలు, సలహాల మేరకు స్థానిక టిడిపి నాయకుల కలుపుకొని రైతు విభాగాన్ని పటిష్ఠం చేయడానికి శాయ శక్తులా కృషి చేస్తామన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన శంకర్ యాదవ్, సహకరించిన టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు.



కలకడ : పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

ఘనంగా మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి-రామాపురం

. హిందూ, ముస్లిములు సంయుక్తంగా చేసుకునే మొహర్రం వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని గువ్వల చెరువు నీలకంతరావుపేట, దూదేకులపల్లి, సుద్దమల్ల, కుమ్మరపల్లి, దూదేకులపల్లె, రాచపల్లి, గంగనేరు, హసనాపురం గ్రామాలలో ముస్లిములు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కుమ్మరపల్లి, గంగనేరు, హసనాపురం గ్రామాలలో పీర్లను చావిడలలో ఏర్పాటుచేసి ప్రార్థనలు చేశారు. మతాలకు అతీతంగా ఐక్యతను, సఖ్యతను చాటి చెబుతుందని మత గురువులు పేర్కొన్నారు. పండగ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు స్థానిక ప్రజా ప్రతినిధులు మొహర్రం భాకాంక్షలు తెలియజేశారు. **కలకడ:** మొహర్రం పండుగను హిందూ ముస్లిం ఐక్యతకు మారుపేరుగా నిర్వహించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం.మండలంలోని పలు గ్రామాలలో మొహరం పండుగను హిందూ ముస్లింలు ఐకమత్యంతో నిర్వహించుకున్నారు. తొమ్మిది రోజులుగా పేర్లను అలంకరించి ఊరేగింపు గావించి చివరి 10వ రోజున జల్దిలో కలపడం ఆనవాయితీగా వస్తున్న విశేషం. ఈ తరుణంలో మండలంలోని ఎర్రకోటపల్లి, కలకడ, కోన, పాపిరెడ్డిగారిపల్లి, నడిమి చర్ల, దేవలంపేట, అగ్రహారం తదితర గ్రామాలలో పేర్లను ప్రత్యేకమైన పుష్పాలుతాలంకరించి ఊరేగింపుగామించడం జరిగింది అయితే అగ్రహారానికి చెందిన బంగారు పీరు అగ్రహారం, దేవళంపేట ,కలకడ పురవీధులలో ఊరేగించి జల్దిలో కలిపి వేయడంతో మొహరం పండుగ ముగిసింది. **కలికిరి:** మండలంలో మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. హిందూ ముస్లిం సోదరులు కలిసి మొహరం వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మండలంలోని మహల్, మేడకుర్తి, గుట్టపాలెం, గడి, కలికిరి గ్రామాలలో తొమ్మిది రోజులు నుండి పేర్లను ప్రత్యేకమైన పూలతో అలంకరించి గ్రామమంతా మెరివిని చేసారు. అనంతరం పీర్లను నీటిలో కలిపేయడంతో పండగ ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలతో పాటు హిందూ సోదరులు పాల్గొని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.

లారీ, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రామాపురం



మృతి చెందిన రోహిత్

మండల పరిధిలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో లారీని బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పాత రాయచోటికి చెందిన రోహిత్, మరో ఇద్దరు బైక్‌పై రాయచోటి నుంచి రామాపురానికి బయలుదేరారు. అదే సమయంలో కడప నుంచి వస్తున్న లారీ ఎదురుగా వచ్చి బైకును ఢీకొంది. ఈ సంఘటనలో బైక్‌పై వస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో చికిత్స నిమిత్తం ముగ్గురిని రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రోహిత్ మృతి చెందాడు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వెంకట్‌ను మెచ్చిన చిరంజీవి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రపతి అ వార్డు గ్రహీత, విభిన్న ప్రతిభావంతుడు ప్రొద్దుటూరుకు చెందిన వెంకట్‌ను మెగాస్టార్ చిరం జీవి మెచ్చుకొని అక్కున చేర్చుకున్నారు. వెంకట్ ప్రతిభను తెలుసుకున్న మెగాస్టార్ హైదరాబాద్ జుబ్లీహిల్స్‌లోని తన స్వగృహానికి ఆహ్వానించినట్లు వెంకట్ తల్లిదండ్రులు శుక్రవారం రాత్రి స్థానిక విలేకరులకు ఫోన్ ద్వారా వివరించారు. వెంకట్ తన పాటలు, డైలాగులు, లిప్ రీడింగ్‌తో చిరంజీవిని ఆశ్చర్యచకితులను చేశారని తెలిపారు. సమస్యలు చుట్టుముట్టనప్పటికీ ఆత్మస్థైర్యంతో పట్టుదలతో వెంకట్‌ను అసాధారణ ప్రతిభావంతుడిగా తీర్చిదిద్దిన వెంకట్ తల్లిదండ్రులు విశాలాక్షి, రాధాకృష్ణయ్యను చిరంజీవి అభినందించారు. తన నుంచి ఏమి సాయం కావాలని చిరంజీవి అడుగ్గా, వెంకట్ బయోపిక్ తీసేందుకు స్క్రిప్ట్ సిద్ధం చేశానని కొణిదెల ప్రోడక్షన్స్‌లో సినిమా తీయాలను అభ్యర్థించినట్లు విశాలాక్షి చెప్పగా, భవిష్యత్తులో సహకారం అందిస్తానని చిరంజీవి చెప్పారన్నారు.. చిరంజీవి జన్మదిన వేడుకల్లో తన ప్రదర్శనకు అవకాశం కల్పించమని వెంకట్ అడుగగా తప్పక కల్పిస్తానని చిరంజీవి హామీ ఇచ్చినట్లు విశాలాక్షి తెలిపారు.